# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 11 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## కేసీఆర్‌కు మళ్లీ వైద్య పరీక్షలు..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి గురువారం సోమాజిగూడలోని యశోద దవాఖానకు వెళ్లిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో తిరిగి హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. గతంలో ఆస్పత్రిలో చేరిన ఆయన, వైద్యుల సూచన మేరకు మరోసారి పరీక్షల కోసం వచ్చారు. హరీష్ రావు, కేటీఆర్‌లు ఆయన వెంట ఉన్నారు. సాయంత్రం దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయి తిరిగి నందినగర్ నివాసానికి చేరుకున్నారు. గతవారం జరిగిన వైద్య పరీక్షలకు ఇవి ఫాలోఅప్ మాత్రమేనని వైద్యులు తెలిపారు.

# ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు

- బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు తెలంగాణ కేబినెట్ ఆమోదం
- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన
- రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలని ప్రభుత్వం స్పష్టీకరణ
- అమిటీ, సెంటినరీ సంస్థలకు యూనివర్సిటీ హోదా మంజూరు
- వచ్చే ఏడాది మార్చిలోపు లక్ష ఉద్యోగాలు భర్తీ
- గోశాలల ఏర్పాటు, నిర్వహణపై కొత్త పాలసీ
- రెండు విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా
- మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు
- మళ్లీ 25న క్యాబినెట్ భేటీ




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. ఇందుకు సంబంధించి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ అంశంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం చర్చించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించింది. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత మార్చి నెలలో జరిగిన సమావేశాల్లో బిల్లులకు శాసనసభ ఆమోదించి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి నివేదించిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు 2018నాటి పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ తేవాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటివరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును సమావేశం చర్చించింది. గతంలో జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో ప్రధానమైన 23 శాఖలకు సంబంధించి 327 అంశాలపై నిర్ణయాలు తీసుకుంది. వాటిల్లో 321 నిర్ణయాలు అమలు జరగ్గా మిగిలిన ఆరింటిపై మంత్రిమండలి అవసరమైన వివరణను ఇచ్చింది. ఇకనుంచి ప్రతి రెండు వారాలకు ఒకసారి విధిగా మంత్రివర్గం సమావేశం కావడమే కాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్ణయాల అమలును సమీక్షించాలని తీర్మానించింది. రాష్ట్రంలోని 306 గోశాలల నిర్వహణపై సమగ్రమైన పాలసీని తీసుకురావాలని నిర్ణయించారు.చివరి దశలో అసంపూర్తిగా ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సత్వరం పూర్తి చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. సమావేశం నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.

న్యాయపరంగా ఎలాంటి చిక్కులు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఆమోదించిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చించాలని తీర్మానించామన్నారు. రాష్ట్రంలో కొత్తగా రెండు ప్రయివేటు యూనివర్సిటీల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఏఎమ్ఐటీవై, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రెండు యూనివర్సిటీల్లో తెలంగాణ విద్యార్థులకు అడ్మిషన్లలో 50 శాతం అవకాశం కల్పించాలనే నిబంధన విధించామన్నారు. సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రీశం మున్సిపాల్టీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. రాష్ట్రంలో గోశాలల ఏర్పాటు, నిర్వహణపై నూతన విధానాల రూపకల్పనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. వచ్చే క్యాబినెట్ సమావేశం లోపు కమిటీ తమ నివేదికను అందించాలని గడువు విధించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయనీ, హైదరాబాద్‌లోని ఎన్కేపల్లిలో వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. 2026 మార్చి వరకు కొత్తగా లక్ష ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపింది. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర వ్యవధిలో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని నిర్ణయించాం. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థికశాఖను ఆదేశించాం" అని మంత్రులు వివరించారు. మత్స్య అభివృద్ధి శాఖకు రూ.121 కోట్ల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల్లో 82 కోట్ల చేప పిల్లలను వదలాలని మంత్రివర్గంలో నిర్ణయించినట్టు వారు తెలిపారు. ఈనెల 25న మళ్లీ క్యాబినెట్ సమావేశం జరుగుతుంది.

# ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదు

- కోడింగ్‌లో ఏఐకు పరిమితి
- బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ప్రస్తుతం డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగాలపై ప్రభావం ఎంతవరకూ ఉంటుందనే చర్చ కొనసాగుతోంది. ఈ క్రమంలో మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. "వచ్చే 100 ఏళ్లైనా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేను" అని స్పష్టం చేశారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ గేట్స్.. "కోడింగ్ అంటే కేవలం టైపింగ్ చేయడం కాదు. దీని కోసం లోతైన ఆలోచన, సృజనాత్మకత అవసరం. ప్రోగ్రామింగ్ లో క్లిష్ట సమస్యలను క్రియేటివ్‌గా పరిష్కరించాల్సి ఉంటుంది. మానవ మేధస్సు లేని ఏఐ అలాంటి పనులు చేయలేం" అని వ్యాఖ్యానించారు.

### కోడింగ్, బయాలజీ, ఎనర్జీ రంగాలకు తక్కువ ముప్పు

ఏఐ వల్ల చాలా రంగాల్లో ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్నా, కోడింగ్, బయాలజీ, ఎనర్జీ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా ఏఐ రాలేదని గేట్స్ అభిప్రాయపడ్డారు. ప్రత్యేకించి సాఫ్ట్‌వేర్ రంగంలోనూ, సాంకేతిక పరిశ్రమల్లోనూ కొన్ని పనుల్లో ఏఐ సహకారం అవసరమైపోయినప్పటికీ, పూర్తి స్థాయిలో మనుషులను భర్తీ చేయడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం గేట్స్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీశాయి. ప్రత్యేకించి కోడింగ్ రంగంలో ఉన్నవారికి ఊరటనిచ్చేలా ఉన్న ఈ వ్యాఖ్యలు.. "ఏఐ ఎంట్రీతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల భవిష్యత్ కష్టమేనా?" అన్న సందేహాలకు సమాధానం లాంటి రూపంలో నిలుస్తున్నాయి.

# ఆల్ప్రోజోలం మత్తు మందుతో కల్తీ కల్లు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి పరిసరాల్లో కల్తీ కల్లు కారణంగా ప్రజలు అస్వస్థతకు గురవుతున్న ఘటనలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక దష్టి సారించింది. గత మూడు రోజులుగా ఆస్పత్రుల్లో బాధితులు చేరుతుండటంతో అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలువురు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. హైదర్‌నగర్, హెచ్ఎంటి సాయి చరణ్ కాలనీ, సర్దార్ పటేల్ నగర్, భాగ్యనగర్ కాలనీల్లోని కల్లు దుకాణాల నుంచి శాంపిళ్లు సేకరించి నారాయణగూడ రసాయన పరీక్షశాలకు పంపారు. నిపుణుల విశ్లేషణలో భాగ్యనగర్ దుకాణం మినహా మిగిలిన వాటిలో 'ఆల్ప్రోజోలం' అనే మత్తు పదార్థం కలిపి ఉన్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి, దుకాణ యజమానులు కూన రవి తేజ గౌడ్, కూన సాయి లేఖ గౌడ్, కల్లు విక్రేతలు, చెట్టు క్రింది నాగేష్ గౌడ్, బట్టి శ్రీనివాస్ గౌడ్‌లను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఇక, నిపుణుల నివేదిక ఆధారంగా బాలానగర్ ఎక్సైజ్ పరిధిలోని హైదర్‌నగర్, హెచ్ఎంటీ కాలనీ (శంషిగూడ), సర్దార్ పటేల్ నగర్ కల్లు దుకాణాల లైసెన్సులను జిల్లా ఎక్సైజ్ అధికారి సస్పెండ్ చేశారు.

### కల్తీ కల్లు ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య

కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ సాయి చరణ్ కాలని కి చెందిన నర్సమ్మ (54) గురువారం పరిస్థితి విషమించి మృతి చెందింది. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఐఐహెచ్‌టీని పోచంపల్లికి తరలించాలి

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్‌లో తాత్కాలికంగా కొనసాగుతున్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)ని యాదాద్రి జిల్లా పోచంపల్లికి తరలించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీ పోచంపల్లి నుంచే శాశ్వతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, తరలింపు ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు అందచేసే మహిళశక్తి చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని కోరారు. చేనేత పథకాలపై గురువారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నేత కార్మికులకు అమసరమైన నూలును అందుబాటులో ఉంచాలని, ఇందుకు వేములవాడ నూలు డిపోను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. నష్టాల్లో ఉన్న టెస్కో షోరూంలను లాభాల్లో ఉన్న షోరూంలలో విలీనం చేయాలని ఆదేశించారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నిధులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని, వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాల కోసం సెప్టెంబర్ నెలలోపే ఆర్డర్లు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే అందిన ఆర్డర్లకు సంబంధించిన వస్త్రాలను వేగంగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగుపరిచి, 'మహిళా శక్తి' చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో భాగంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 33 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,691 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారని, వెరిఫికేషన్ పూర్తి కాగానే నిధులు విడుదల చేస్తామని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం కింద 194 మంది మృతుల కుటుంబాలకు రూ. 9.70 కోట్లు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం, 2024 సంవత్సరానికి గాను జాతీయ చేనేత పురస్కారాలకు ఎంపికైన పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద, గూడ పవన్‌లను మంత్రి తుమ్మల శాలువాతో సత్కరించారు.



## ఏసీబీ అధికారుల దాడులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సతీష్ రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్కల్ మండలంలోని నిమ్జ్ నందు వ్యవసాయ భూమిని కోల్పోయిన రైతులకు రూ.52 లక్షల పైచిలుకు డబ్బులకు సంబంధించిన చెక్కు ఇచ్చేందుకు ఆర్డీఓ రామ్‌రెడ్డికి చెందిన అధికారిక డ్రైవర్ దుర్గయ్య నుంచి గత రెండు మూడు నెలల నుంచి బేరసారాలు జరుపుతున్నారు. చెక్కులు త్వరగా ఇప్పించేందుకు మొదట రూ. 4 లక్షలు డిమాండ్ చేసిన దుర్గయ్య చివరికి లక్ష రూపాయలకు ఒప్పుకున్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక నిమ్జ్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్ రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజారెడ్డి తన వాటా రూ.50 వేలు తన ఇంటి వద్ద ఇవ్వాలని బాధితులకు తెలిపినట్టు తమ వద్ద రికార్డులు ఉన్నాయని ఏసీబీ సుదర్శన్ తెలిపారు. నిందితులు డిప్యూటీ కలెక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డీల్ కుదిర్చిన ఆర్డీవో అధికారిక డ్రైవర్ దుర్గయ్యను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎవరైనా లంచం అడిగితే నేరుగా ఏసీబీని సంప్రదించాలని డీఎస్పీ సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు.

### రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ





గచ్చిబౌలి మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ వేణుగోపాల్ ఎసిబికి చిక్కాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కేసు పరిష్కారం నిమిత్తం ఎస్ఐ వేణుగోపాల్ రూ.25 వేలు లంచం డిమాండ్ చేశాడు. రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా ఎస్ఐ వేణుగోపాల్ పట్టుబడ్డాడు. సొమ్మును స్వాధీనం చేసుకున్న ఎసిబి అధికారులు ఎస్ఐ వేణుగోపాల్‌ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇటీవలి కాలంలో పోలీసు శాఖకు చెందిన వ్యక్తులు ఎసిబికి చిక్కుతుండటం తెలిసిందే. కాగా ఎసిబికి పట్టుబడ్డ ఎస్ఐ వేణుగోపాల్ ఈ మధ్యనే ప్రమోషన్‌లో భాగంగా గచ్చిబౌలి మహిళా పోలీసుస్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

అసెంబ్లీ కార్యకలాపాలు

# సజావుగా జరిగేందుకు సహకరించాలి

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



శాసనమండలి, శాసనసభల కార్యకలాపాలు సజావుగా జరగడానికి అందరూ సహకరించాలనీ, ముఖ్యంగా మీడియా ప్రతినిధులు ఇందులో కీలక పాత్ర పోషించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తెలంగాణ లేజిస్లేటివ్ మీడియా అడ్వైజరీ నూతన కమిటీ మొదటి సమావేశం గురువారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో జరిగింది. ఇందులో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, లేజిస్లేటివ్ సెక్రెటరీ డా. వి.నరసింహాచార్యులు, కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కో చైర్మన్ పరిపూర్ణాచారి, సభ్యులు ఈ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కీలకమైన శాసనసభ, మండలి గౌరవం, ప్రాధాన్యతలను కాపాడాలని కోరారు. మీడియా సలహా మండలి ద్వారా మీ వంతుగా సేవలను అందించేందుకు మంచి అవకాశమని చెప్పారు. సీనియర్ జర్నలిస్టులుగా ఎంతో అనుభవం మీరంతా ఉభయ సభలు సజావుగా జరగడానికి కృషి చేయాలన్నారు. మనందరం సభల్లో అర్థవంతమైన చర్చలు జరిగేలా చూడాలన్నారు. అందరమూ చొరవ చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలనేది అందరి ఉద్యేశమని అభిప్రాయపడ్డారు. శాసనసభ సమావేశాల సమయంలోనే కాదు, ఇతర సమయాలలో కూడా శాసనసభకు సంబంధించిన వార్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాసనసభ , శాసనమండలి సమావేశాలు సజావుగా నడవాలంటే మీడియా పాత్రనే కీలకమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభను హుందాగా నిర్వహించడానికి తోడ్పడాలని చెప్పారు. రానున్న రోజుల్లో శాసనసభ, శాసనమండలి ఒకే భవనంలోకి రాబోతున్నాయని చెప్పారు. కావున కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా కమిటీ సభ్యులకు ఎలాంటి సహాయం కావాలన్న అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలి వ్యవహారాలలో మీడియాకు బాధ్యతను కల్పించడానికి, మరింత పాత్రను పోషించడానికే మీడియా అడ్వైజరీ కమిటీని నియమించినట్టు తెలిపారు. ఉభయసభల నిర్వాహణలో అందరి సహకారాన్ని అవసరమన్నారు. సమావేశాల సందర్భంగా మీడియా ప్రతినిధులకు అవసరమైన పాసులు, సౌకర్యాలు, వసతులపై ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సమావేశాల సందర్భంగా జారీ చేసే పాస్‌ల విషయంలో కమిటీ సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందనీ, మంచి వాతావరణంలో సమావేశాలు జరిగేలా అందరం కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సభ్యులంతా సమావేశాల నిర్వహణ, పాసులు, వసతులపై అభిప్రాయాలు చెప్పారు.

# ఆర్టీసీలోకి 422 కొత్త బస్సులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో




ప్రయాణికులకు సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ పలు చర్యలు చేపట్టింది. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులను పక్కన పెడుతూ 422 కొత్త బస్సుల ను అందుబాటులో తీసుకు రానుంది. మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో ఆక్యూపెన్సీ పెరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే దీని దృష్ట్యా ఆక్యూపెన్సీకి అనుగుణంగా బస్సులు నడపాలని ఆ సంస్థ నిర్ణయించింది. తెలంగాణ ఆర్టీసీలో 15 ఏళ్లు దాటిన, 15 లక్షల కిలోమీటర్లు తిరిగినా బస్సులను పక్కన పెట్టడానికి ఆర్టీసీ నిర్ణయించిందని తెలిసింది. ఇప్పటికే కాలంచెల్లిన 294 పల్లె వెలుగులు, 88 మెట్రో డీలక్స్‌లను, 17 ఎక్స్‌ప్రెస్ లు, 22 డీలక్స్‌ల స్థానంలో కొత్త బస్సులను రోడ్లపైకి రానున్నాయి.

# ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటాం..



- బలగం టీవీ సీఈవో బాలు కాయితి
- జర్నలిస్టు ప్రసాద్ కుటుంబానికి పరామర్శ, ఆర్థిక సాయం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇటీవల టీవీ 9 జర్నలిస్టు ప్రసాద్ గుండెపోటుతో హఠన్మరణం చెందగా.. గురువారం బాధిత కుటుంబాన్ని బలగం టీవీ సీఈవో బాలు కాయితి పరామర్శించారు. ఇప్పటికే ప్రసాద్ అంత్యక్రియలకు కేటీఆర్ సహకారంతో రూ.50 వేలు అందించగా.. గురువారం రూ.25 వేలు ప్రసాద్ కుటుంబానికి బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షులు జిందం చక్రపాణితో కలిసి అందించారు. బలగం టీవీ కథనాలకు స్పందించిన సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల చిన్న రూ.10 వేలు, బలగం టీవీ తరుపున బాలు కాయితి రూ.10 వేలు, సిరిసిల్ల రాధా మాధవ్ రెడిమెడ్ డ్రెస్సెస్ యాజమాని వంశీ శోభన్ రూ.5 వేలు అందించారు.ఈ మొత్తాన్ని రూ.25 వేలు ప్రసాద్ సతీమణి రేవతికి అందించారు. ప్రసాద్ కుటుంబానికి డబుల్ బెడ్ రూం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ పరామర్శ

సిరిసిల్ల టివి9 రిపోర్టర్ ప్రసాద్ హఠన్మరణం చెందడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జీ చల్మెడ లక్ష్మీ నరసింహా రావు గురువారం పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. చల్మెడ వెంట బీఆర్ఎస్ నేతలు ఏనుగు మనోహర్ రెడ్డి, కల్లూరి రాజు, రమరాజు, సత్తార్ తదితరులు ఉన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**ఎన్నికల ముందు? రివిజన్ అవసరమేంటి?**

**ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సుప్రీంకో ర్టులో కీలక విచారణ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను సవరించాలన్న ఆవశ్యకత ఏమిటని అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల సంఘాన్ని కఠినంగా ప్రశ్నించింది. “సవరణ ప్రక్రియ చట్టబద్ధమేనని మేము అంగీకరిస్తున్నాం. కానీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ తడిమి ఎందుకు?” అంటూ జస్టిస్ సుధాన్షు దులియా వ్యాఖ్యానించారు. “మీరు చేపట్టే ప్రక్రియపై అభ్యంతరం లేదు. కానీ ఈ సమయంలో చేపట్టడమే సమస్య” అని స్పష్టం చేశారు.కోర్టు అభిప్రాయం ప్రకారం, ఓటర్ల



జాబితా నుంచి పేర్లు తొలగించిన తర్వాత తిరిగి జోడించుకోవడానికి ప్రజలకు తగిన సమయం ఉండదని పేర్కొంది. ఈ సమయంలో జరిగే సవరణ పేద వర్గాల ఓటర్లకు నష్టం కలిగించేలా ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఆందోళనలు కూడా జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో ఓటర్లను రీ-వెరిఫై చేసే సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డులను గుర్తింపుగా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై స్టే విధించనని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ జూలై 28వ తేదీన జరుగనుంది.

# భారత మ్యాప్‌లో తెలంగాణ లేకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, ఏపీ మంత్రి లోకేశ్‌కు బహుమతిగా ఇచ్చిన భారతదేశ మ్యాప్‌లో తెలంగాణ రాష్ట్రం లేకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు (కేటీఆర్) తీవ్రంగా స్పందించారు. ఇది కేవలం పొరపాటేనా? లేక బీజేపీ అధికారిక విధానమేనా? అని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని నిలదీశారు. “భారత చిత్రపటంలో తెలంగాణను తొలగించడం తీవ్రంగా బాధించింది. ఇది తెలంగాణ రాష్ట్ర భౌగోళిక, సాంస్కృతిక గుర్తింపును



అగౌరవపరిచే చర్య. దశాబ్దాలపాటు ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ కోసం జరిగిన పోరాటాలను, ఉద్యమాలను, బలిదానాలను ఈ ఒక్క చర్య తో మనుగడకే ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నమా?” అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. “ఇది పొరపాటైతే వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే... ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమేనా?” అని కేటీఆర్ ప్రధానిని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ఇచ్చిన మ్యాప్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మాత్రమే చూపించడమంటే, తెలంగాణను లెక్కచేయక పోవడమేనని తీవ్రంగా విమర్శించారు. “ఈ చర్య తెలంగాన ప్రజల ఆత్మగౌరవానికి తూటాగా మారింది. చరిత్రను తుడిచివేయాలన్న ప్రయత్నాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరు” అని హెచ్చరించిన కేటీఆర్, బీజేపీ నేతలు వెంటనే తెలంగాణ ప్రజల సమక్షంలో క్షమాపణ చెప్పాలన్నారు. ఇటీవల వరుసగా రాష్ట్రాన్ని కించపరిచే విధంగా బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని, కేంద్రం స్పష్టమైన అభిప్రా యంతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోదీ స్వయంగా ఈ అంశంపై స్పందించి సమాధానం ఇవ్వాలని, స్పష్టత లేనిదే తెలంగాణ ప్రజల్లో ఆగ్రహం చల్లారదని అన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి : కేటీఆర్

**కల్తీ కల్లు ఘటనపై స్పందించిన కేటఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లో కల్తీ కల్లు కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు (కేటీఆర్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ప్రభుత్వం నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. “ఈ ఘటన అత్యంత బాధాకరం. కష్టపడే వర్గాలే ఇలాంటి కల్తీ కల్లుబారిన పడుతున్నారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సహాయహస్తం అందించాలి. ఒక్కొక్క కుటుంబానికి కనీసం రూ. 20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను” అని కేటీఆర్



పేర్కొన్నారు.హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొన్న ఆయన, “ఇంతమంది చనిపోతే ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం దారుణం” అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దారుణ సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని, తక్షణమే ప్రజలకు వివరణ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. “కల్తీ కల్లు నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకోకపోతే మిగతా ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి” అని ఆయన హెచ్చరించారు.

# అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని తండ్రిని హత్య చేసిన కూతురు

- **ప్రియుడు, తల్లితో కలిసి దారుణం**

**బలగం టీవీ, హైదరాబాద్**

అక్రమ సంబంధాలకు అడ్డు వస్తున్నాడన్న కోపంతో తండ్రిని కూతురు, ఆమె ప్రియుడు, తన తల్లితో కలిసి దారుణ హత్యకు పాల్పడ్డ ఘోర ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నిందితులు మృతుడిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించినా, చివరకు నిజాలు వెలుగుచూశాయి.



నగరంలోని కవాడిగూడ ముగ్గుబస్తీకి చెందిన వడ్లూరి లింగం (45) నూర్బన్ బజార్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య శారద (జీహెచ్ఎంసీ స్వీపర్ కాగా, కూతురు మనిషా భర్త రమేశ్‌ను వదిలి మల్కాజిగిరికి చెందిన రాపిడో రైడర్ మహమ్మద్ జావీద్‌తో అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. లింగం తన కూతురు బంధాన్ని తరచూ నిలదీస్తూ వాదనలు చేస్తుండటంతో.. ముగ్గురు కలిసి అతనిని హత్య చేయాలని పథకం వేసుకున్నారు. ఇందుకోసం జూలై 5న నిద్రమాత్రలు కలిపిన మద్యం లింగానికి ఇచ్చి మత్తెక్కించారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న లింగాన్ని భార్య శారద, కూతురు మనిషా కాళ్లు, చేతులు పట్టగా.. జావీద్ దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి, చివరకు ఉరి వేసి హత్య చేశారు. అనంతరం ప్రియుడితో కలిసి ప్రియురాలు సెకండ్ షో సినిమాకు వెళ్లారు. ఇంటికి వచ్చిన తరువాత కారు బుక్ చేసుకొని మృతదేహాన్ని అందులోకి ఎక్కించారు. కారు డ్రైవర్ కి అనుమానం రావడంతో ప్రశ్నించాడు. కల్లు తాగి మత్తులో ఉన్నాడని సమాచారం ఇవ్వడంతో ఎదులాబాద్ వద్ద దిగారు. అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎదులాబాద్ చెరువులో 7న మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐలు శేఖర్, సాయి కుమార్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు శవాన్ని పరిశీలించగా గాయాల తీరుతో అనుమానాస్పదంగా గుర్తించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కుటుంబసభ్యులను ప్రశ్నించగా ముగ్గురు నిందితులు నేరం ఒప్పుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరశురాం, ఎస్ఐలు శేఖర్, సాయికుమార్ తదితరులని రాచకొండ పోలీస్ కమిషనర్ అభినందించారు.




# స్కూల్ బస్సులో చెలరేగిన మంటలు..

- **విద్యార్థులకు తప్పిన ప్రమాదం**
- **సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘటన**

**బలగం టీవి, హైదరాబాద్**

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో పెను ప్రమాదం తప్పింది. విధ్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే డ్రైవర్, సహాయకుడు అప్రమత్తమవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. గురువారం ఉదయం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సులోకి కిష్టారెడ్డిపేట వద్ద విద్యార్థులు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో బస్సులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ పిల్లలను వెంటనే బయటకు దింపేశారు. మంటలు వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.





# భార్య మెడను కాలుతో తొక్కి హత్య చేసిన భర్త

- **బెంగళూరులో దారుణం**

**బలగం టీవి, హైదరాబాద్**

భార్యను కాలుతో తొక్కి హత్య చేసిన దారుణ ఘటన కర్నాటక రాజధాని బెంగళూరులో చోటుచేసుకుంది. స్థానిక శ్రీనివాసపూర్‌లో నివసిస్తున్న పద్మజ-హరీష్ కుమార్ దంపతుల మధ్య గత కొన్ని రోజులుగా కలహాలు సాగుతున్నాయి. ఇద్దరు పిల్లలున్న ఈ కుటుంబంలో హరీష్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పని చేసేవాడు. అయితే గత కొన్ని నెలలుగా ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. పద్మజ మాత్రం ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తాజాగా షాపింగ్ చేసేందుకు వెళ్లి వచ్చిన పద్మజతో హరీష్ వాగ్వాదానికి దిగాడు. చిన్నపాటి గొడవ కాస్తా తీవ్ర ఘర్షణగా మారింది. కోపోద్రిక్తుడైన హరీష్ ఆమె గొంతు నులిమి, నేలపైకి తోసేశాడు. అనంతరం ఆమె మెడపై కాలుతో మోది, ఊపిరి ఆపి హత్య చేశాడు. దీంతో పద్మజ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, హరీష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భారతీయ పూజారి వేధించాడు

- **మలేషియా మోడల్ లిషాలినీ కనరన్**

**బలగం టీవి, హైదరాబాద్**



మలేషియాకు చెందిన ప్రముఖ మోడల్, 2021 మిస్ గ్రాండ్ మలేషియా విజేత లిషాలినీ కనరన్‌పై ఓ భారతీయ పూజారి అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేశారు. సిపాంగ్‌లోని మారియమ్మన్ ఆలయంలో ఈ దారుణం జరిగినట్లు స్థానిక మీడియా తెలిపింది. జూన్ 21న ఆలయాన్ని దర్శించుకున్న లిషాలినీ, ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక పూజారి తనను దీవించేందుకు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రార్థనలు ముగిశాక కలవాలని చెప్పిన పూజారి, సుమారు గంట తర్వాత వచ్చి తనను ఆలయం సమీపంలోని ప్రైవేటు ఆఫీసుకు తీసుకెళ్లాడని ఆమె తెలిపారు. ఆ సమయంలో తనపై ఓ ద్రవాన్ని చల్లి, అశ్లీలంగా ప్రవర్తించినట్లు లిషాలినీ తెలిపారు. తన ఛాతిని ముట్టి, చేతులు బ్లౌజ్‌లోకి చొప్పించారని ఆమె ఆరోపించారు. ఆ ఘటనకు తాను తీవ్ర మానసిక ఆవేదనకు గురయ్యానని, నిశ్చేష్టురాలిగా మారిపోయినట్లు వెల్లడించారు. ఇటీవల తాను పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించిన లిషాలినీ, జూలై 4న అధికారికంగా కేసు నమోదు చేసినట్లు సిపాంగ్ ఏసీపీ నొరిజామ్ బహమన్ తెలిపారు. ప్రస్తుతానికి ఆ పూజారి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనను కొందరు అధికారులు బయటకు చెప్పొద్దని సూచించినప్పటికీ.. తనకెదురైన అన్యాయాన్ని బయటపెట్టక తప్పలేదని లిషాలినీ తేల్చేశారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ప్రస్తుతం మలేషియా అంతటా చర్చనీయాంశంగా మారింది. పూజారి అరెస్ట్ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను నియమించినట్లు సమాచారం.



## సామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

**-అక్రమ వడ్డీ , ఫైనాన్స్ వ్యాపారస్తులపై పోలీసుల కొరడా.**

**-10 మందిపై కేసులు నమోదు,సుమారుగా 60,00,000/- రూపాయల విలువ గల వివిధ డాక్యుమెంట్లు స్వాధీనం.**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం,ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై గురువారం ఉదయం పోలీసులు 20 టీమ్ లగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న ఎనమిది మందిని అదుపులోకి తీసుకొని సుమారుగా 60,00,000/- రూపాయల విలువ గల వివిధ డాక్యుమెంట్లతో పాటుగా తాకట్టు పెట్టుకున్న పలు వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు తమకున్న ఉన్న అత్యవసర పరిస్థితి,తాత్కాలిక అవసరాల కోసం అధిక మొతంలో అవసరాలకు మించి అధిక వడ్డీలకు అప్పు చేసి ఆతరువాత అప్పులు,అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు.ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వొచ్చు అని,అలాగే స్థానిక పోలీసు వారికి పిర్యాదు చేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందనిఅన్నారు. అప్పు తీసుకోవడం,ఇవ్వడం నేరం కాదు కానీ ఆర్ బీ ఐ నియమ నిబంధనలు,తెలంగాణా మనిలెండింగ్ చట్టంలోని నిబంధనల ప్రకారం చట్ట బద్ధంగా ఎవరైనా లైసెన్స్ తొ అప్పులు ఇవ్వవచ్చు, తీసుకోవచ్చు కాని చట్ట విరుద్ధంగా, అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- చేపల పెంపకంలో మత్స్యకారులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, చేపల పెంపకంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటలోని రైతు వేదికలో నేషనల్ అగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మత్స్య రైతుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సొసైటీ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. అనంతరం చేపల స్టాల్స్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్య సంపదను పెంపొందించడానికి తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్ పర్యటనలో మంత్రి శ్రీహరితో చేపల పెంపకం, మత్స్యకారుల గురించి చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని చెరువుల్లోకి సకాలంలో చేప పిల్లలను పంపిణీ చేస్తుందని, బలహీన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని అన్నారు. గతంలో మిడ్ మానేరులో చేపలను వదలడం జరిగిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు మల్కపేట్ రిజర్వాయర్ కూడా అందుబాటులోకి వచ్చిందని, వాటిలో కూడా చేపల పెంపకం ఏర్పాట్ల విధానాన్ని పరిశీలించాలని సూచించారు. గతంలో తెగిపోయిన చెరువుల మరమ్మతులను పూర్తి చేశామని, ఇంకా ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే చేపడతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే కథలాపూర్ మండలంలోని తెగిపోయిన చెరువులను బాగు చేసినట్లు తెలిపారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి ఎల్లారెడ్డిపేట వరకు రైతులకు సాగునీరు అందించామని పేర్కొన్నారు.

గతంలో మిడ్ మానేరు డ్యాంలో కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకం కోసం ముంపు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కేజ్ కల్చర్ చేపల పెంపకాన్ని చేపట్టడానికి ముందుకు రావాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తుందని తెలిపారు. దేశంలో మత్స్య సంపద పెరగాలని, చేపలు ఆరోగ్యానికి మంచివని, ప్రభుత్వం మత్స్యకారులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందని అన్నారు.

గత ప్రభుత్వం పెట్టిన ఒక్క పథకాన్ని కూడా రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూ, నూతన పథకాలను అమలు చేస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం, ?500కే సిలిండర్, ?10 లక్షల ఆరోగ్యశ్రీ, పది సంవత్సరాలుగా పేద ప్రజలు ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, డీఏవో అఫ్జల్ బేగం, మల్లికార్జున్, పి. కిషోర్, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సునీల్ కుమార్, అడ్వైజర్ విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు ,విత్తనాలు నిబంధనలు ప్రకారం విక్రయించాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎరువులు , విత్తనాల స్టాక్, సేల్స్ రిజిస్టర్ లను పకడ్బందీగా నిర్వహించాలని విక్రయదారులను, అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం ముస్తాబాద్ మండలంలోని శ్రీనివాస్ ఎరువులు, విత్తనాలు, కోరమండల్ మన గ్రోమోర్, విక్రయ దుకాణాలను , గోదాములను, ఆవునూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలను ఆకస్మికంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ ఎరువులు, విత్తనాలు, కోరమండల్ మన గ్రోమోర్ విక్రయ దుకాణాలలో,

ఆవునూరు లోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని సేల్స్ రిజిస్టర్ మరియు స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదాం ను తనిఖీ చేయగా కోరమండల్ మన గ్రోమోర్ గోదాములో యూరియా స్టాక్ లేనట్లు గమనించి సదరు దుకాణంకు నోటీసులు జారీ చేయవలసిందిగా కోరారు. సదరు నోటీసులకు సరైన సంజాయిషీ సమర్పించి యూరియా స్టాక్ వెంటనే తెప్పించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని, నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని , కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని విక్రయ యజమానులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ దత్త సాయి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో గురువారం రోజున గురు పౌర్ణమి పురస్కరించుకొని శ్రీ దత్త సాయి ఆలయంలో ఉదయం నుండి సాయిబాబాకు అభిషేకాలు, హారతి, పల్లకి సేవ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్న ప్రసాదాలు స్వీకరించిన ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబా ఆశీస్సులు తీసుకున్నారు.

## దేవాలయం ఆవరణలో మొక్కలు నాటిన నాయకులు

**బలగం టీవీ, బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ దత్తసాయి బాబా ఆలయ ఆవరణలో నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమములో ఆలయ చైర్మన్ ఉకంటి కనుకరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కాసారపు శ్రీధర్ గౌడ్, ఎర్ర రవి, వేముల సత్యం, గోగురి దామోదర్ రెడ్డి, నరేష్ ,హరిత సేన సభ్యులు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేకేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు..

**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లో ఆయనకు కాంగ్రెస్ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ నేతలు జూపల్లి రాజేశ్వరరావు, పొన్నం లక్ష్మణ్ గౌడ్, మందాటి తిరుపతి యాదవ్, కాంట్రాక్టర్ జూపల్లి వెంకట్ రావు, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ మాజీ సర్పంచ్ పొన్నాల మల్లారెడ్డి, వెంకటాపూర్ గౌడ సంఘం నేత విక్కుర్తి స్వామిగౌడ్ లు మహేందర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.బర్త్‌డే విషెస్ తెలిపిన కాంగ్రెస్ నేతలకు మహేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.




## గురు పౌర్ణమి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, వేములవాడ**

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గంలోని పలు సాయిబాబా దేవాలయాలను సందర్శించారు. వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్, తిప్పాపూర్, మరియు వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలో గల శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయాలలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో విప్ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. సాయిబాబా స్వామి వారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గురు పౌర్ణమి గురువులను పూజించి గౌరవించుకునే పవిత్రమైన రోజని అన్నారు. మన సనాతన ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినందుకు వారిని అభినందించారు. చివరగా, ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సాయిబాబా దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.

# నిలకడగా ఇంగ్లండ్ బ్యాటింగ్




- తొలి రోజు 4 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసిన ఇంగ్లండ్
- రెండు వికెట్లు తీసని తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు నిలకడగా ఆడింది. గురువారం ప్రారంభమైన తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 83 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. తొలి రోజు భారత్ బౌలర్లు ఆతిథ్య జట్టుకు క్రమం తప్పకుండా దెబ్బతీశారు.

ఇంగ్లండ్‌కు జో రూట్(191 బంతుల్లో 9 ఫోర్లు) 99 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, కెప్టెన్ బెన్ స్టోక్స్(102 బంతుల్లో 3 ఫోర్లు) 39 పరుగులతో క్రీజులో ఉన్నాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు నాటౌట్ భాగస్వామ్యంతో ఇంగ్లండ్‌ను నిలబెట్టారు. భారత్ బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డి (2/46) రెండు కీలక వికెట్లు తీసి ఆకట్టుకున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసి ఇంగ్లండ్ మీద ఒత్తిడి తెచ్చారు. భారత బౌలింగ్ అటాక్ ధాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు తమ సహజమైన దూకుడు మానేసి, జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. రెగ్యులర్ షాట్లకు పోకుండా నెమ్మదిగా స్కోరు ముందుకు నడిపారు.

ఇంగ్లండ్ ఓపెనర్లు జాక్ క్రాలీ (18), బెన్ డకెట్ (23) స్వింగ్‌కు ఇబ్బంది పడ్డారు. ఆకాశ్ దీప్ వేసిన ఓవర్‌లో రెండు బౌండరీలు వచ్చినా, దాడికి ఆడే శైలికి విరుద్ధంగా జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. డ్రింక్స్ విరామం తర్వాత గిల్ బౌలింగ్‌ను అప్పజెప్పిన నితీశ్ రెడ్డి, ఒకే ఓవర్లో డకెట్, క్రాలీ లను ఔట్ చేస్తూ ఇంగ్లండ్‌కు డబుల్ షాక్ ఇచ్చాడు. రూట్, ఓలీ పోప్ జోడీ అత్యంత రక్షణాత్మకంగా ఆడింది. ఈ భాగస్వామ్యం 109 పరుగులు సాధించింది. 102 బంతుల్లో రూట్ అర్ధశతకం నమోదు చేశాడు. రెండో సెషన్‌లో కేవలం 70 పరుగులు మాత్రమే వచ్చాయి. రెండో సెషన్ అనంతరం తొలి ఓవర్‌లోనే జడేజా బౌలింగ్‌లో పోప్ (44) ఔట్ కాగా, బ్రూక్ (11) బుమ్రా మ్యాజికల్ డెలివరీకి బోల్డ్ అయ్యాడు. ఆ తర్వాత రూట్, స్టోక్స్ జోడీగా బ్యాటింగ్ చేస్తూ ఐదో వికెట్‌కు అజేయంగా 79 పరుగులు జోడించింది.




# అక్టోబర్ 31న బాహుబలి రీ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత సినిమా చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిన 'బాహుబలి' మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే చిత్రంగా ప్రదర్శించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేసింది. అక్టోబర్ 31న ఈ భారీ ఎపిక్‌ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి, కథానాయకుడు ప్రభాస్ తమ ఆనందాన్ని సోషల్‌మీడియా వేదికగా వ్యక్తం చేశారు. "పదేళ్ల క్రితం ఓ ప్రశ్న దేశాన్ని ఏకం చేసింది. ఇప్పుడు ఆ ప్రశ్న, సమాధానం రెండూ కలిసి ఒకే గ్రాండ్ ఎపిక్‌గా వస్తున్నాయి" అని ప్రభాస్ పేర్కొనగా, "ఈ ప్రయాణం ఎన్నో జ్ఞాపకాలను, స్ఫూర్తిని మిగిల్చింది. పదేళ్లు పూర్తవడం గర్వకారణం" అని రాజమౌళి స్పందించారు.







## ఆగస్ట్ 22న ఆర్.నారాయణమూర్తి 'యూనివర్సిటీ'

**బలగం టీవీ, హైదరాబాద్**

పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'యూనివర్సిటీ' (పేపర్‌లీక్) ఆగస్ట్ 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి నందిని సిధారెడ్డితో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ..గత కొన్నేళ్లుగా విద్యారంగంలో జరుగుతున్న పేపర్‌లీక్‌ల వల్ల జరిగే నష్టాలను చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కించామని తెలిపారు. గ్రూప్ 1, 2 పరీక్షల్లో ప్రశ్నాపత్రాల్ని లీకులు చేయడం చూస్తుంటే.. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలు ఏమైపోతాయో అని భయం కలుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి పాటలు: గద్దర్, జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, నిర్మాత, దర్శకత్వం: ఆర్.నారాయణమూర్తి.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి చిత్రాలతో సూపర్ హిట్‌లను అందుకున్న నిర్మాత ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. దగ్గుబాటి రానా ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. పరచూరి విజయ్ ప్రవీణ ఆర్ట్స్ బ్యానర్‌పై గోపాలకృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా జూలై 18న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తాజాగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూరల్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనె వెండితెరకు పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజరు, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేంసాగర్ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు.

## చరిత్ర సృష్టించిన
# భారత మహిళల జట్టు

**ఇంగ్లండ్ గడ్డపై తొలిసారి భారత్ ఖాతాలో టీ20 సిరీస్**

**బలగం టీవీ, హైదరాబాద్**




ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఇంగ్లాండ్ గడ్డపై అసాధ్యంగా కనిపించిన టీ20 సిరీస్‌ను తొలిసారిగా భారత్ కైవసం చేసుకుంది. ఐదు టీ20ల సిరీస్‌లో బుధవారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం) జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి 3-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇప్పటి వరకు ఇరు జట్ల మధ్య జరిగిన ఆరు టీ20 సిరీస్‌లలో ఇంగ్లండ్‌దే పైచేయి. ఈసారి మాత్రం భారత మహిళల జట్టు తొలి రెండు మ్యాచ్‌లను గెలిచి, మూడో టీ20లో ఓడినా నాలుగో టీ20లో తిరిగి విజయబాటలోకి వచ్చి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది.

మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు భారత స్పిన్నర్ల ధాటికి కుదేలైంది. రాధా యాదవ్ (2/15), శ్రీచరణి (2/30) మాయాజాలంతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 126 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ సోఫియా డంక్లీ (22) మాత్రమే కొంత స్థిరంగా నిలిచింది. 126 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన భారత్.. ఓపెనర్లు స్మృతి మంధాన (32), షెఫాలీ వర్మ (31) వేగంగా ఆరంభించి దారితెరిపించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (26), జెమీమా రోడ్రిగ్స్ (24 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. భారత్ 17 ఓవర్లలోనే విజయం సాధించింది. ఈ సిరీస్‌లో చివరి మ్యాచ్ శనివారం బర్మింగ్‌హామ్‌లో జరగనుంది. ఇప్పటికే సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న భారత్ ఆఖరి మ్యాచ్‌ను గెలిచి విజయం తో ముగించాలనే లక్ష్యంతో బరిలో దిగనుంది.



## గంట మోగించి మ్యాచ్ ప్రారంభించిన సచిన్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. క్రికెట్ మక్కాగా పరిగణించే ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో సచిన్ టెండూల్కర్ ఐదు నిమిషాల పాటు గంట మోగించాడు. లార్డ్స్ మైదానంలో సచిన్ గంట మోగించడం ఇదే తొలిసారి. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా లార్డ్స్ వేదికగా గురువారం భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌ను సచిన్ గంట మోగించి ప్రారంభించాడు. 2007 నుంచి లార్డ్స్ మైదానంలో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతీ టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు ముఖ్యమైన వ్యక్తులతో గంటను మోగిస్తున్నారు. లార్డ్స్‌లో సెంచరీ చేయడంతో పాటు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న మాజీ ఆటగాళ్లతో గౌరవ సూచకంగా బెల్ మోగిస్తున్నారు. గతంలో భారత్ నుంచి సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, కపిల్ దేవ్ వంటి దిగ్గజ ఆటగాళ్లు ఈ బెల్‌ను మోగించారు. సచిన్ టెండూల్కర్ లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేయనప్పటికీ, క్రికెట్‌లో అతని గొప్ప ప్రదర్శన, వారసత్వానికి గౌరవ సూచకంగా మెరలిన్ క్రికెట్ క్లబ్(ఎంసీసీ) బెల్ మోగించి సత్కరించింది. భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న సిరీస్‌కు కూడా సచిన్-అండర్సన్ అని పేరు పెట్టిన విషయం తెలిసిందే. ఎంసీసీ మ్యూజియంలో సచిన్ చిత్రపటాన్ని కూడా ఆవిష్కరించారు.

## విడాకుల వదంతులకు నయనతార ముగింపు

**బలగం టీవీ, హైదరాబాద్**



కోలీవుడ్ లో ఇటీవల నుంచి హాట్ టాపిక్‌గా మారిన నయనతార-విఘ్నేశ్ శివన్ విడాకుల వదంతులకు స్వయంగా నయనతార ముగింపు పలికారు. తమ వైవాహిక జీవితంపై వస్తున్న వార్తలను ఆమె ఖండిస్తూ, భర్తతో కలిసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా "మా గురించి వచ్చే అర్ధం పర్ధం లేని వార్తలు చూసినప్పుడు మా స్పందన ఇదే" అంటూ స్పష్టమైన సంకేతం ఇచ్చారు. దీంతో ఈ జంట విడిపోతున్నారన్న ప్రచారాలకు గట్టి కౌంటర్ ఇచ్చినట్లైంది. ఇటీవల నయనతార తన సామాజిక మాధ్యమాల్లో "తెలివితక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకోవడం పొరపాటు. భర్త తప్పు చేసినా భార్య బాధ్యత వహించాల్సిన అవసరం లేదు" అనే విధంగా ఒక పోస్టు షేర్ చేయడం చర్చనీయాంశమైంది. కొద్దిసేపటికే ఆ పోస్టును తొలగించినప్పటికీ, అప్పటికే స్క్రీన్‌షాట్లు వైరల్ కావడంతో విడాకుల వదంతులు ఊపందుకున్నాయి.